ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5




అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 2 సెప్టెంబరు 2025

నేడు సీఎం చంద్రబాబు విశాఖ రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం విశాఖ రానున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.45 గంటలకు ఆర్కే బీచ్ రోడ్డులో గల కోస్టల్ బ్యాటరీ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లి ఈస్ట్‌కోస్ట్ మారిటైమ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం 4.20 గంటలకు నోవాటెల్ నుంచి బయలుదేరి కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుని 4.30 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరతారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు

91 శాతం మందికి పంపిణీ

- మొత్తం లబ్ధిదారులు 2,57,705
- తొలి రోజు 2,35,486 మందికి డబ్బులు అందజేత



మాకవరపాలెం మండలం గిడుతూరులో వృద్ధునికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బులు అందజేస్తున్న శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు. పక్కన ఆర్డీవో పీవీ రమణ, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర

అనకాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బుల పంపిణీ సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 91 శాతం పూర్తయ్యింది. ఈ నెలకు సంబంధించి మొత్తం 2,57,705 మందికి పింఛన్ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.108.43 కోట్లు విడుదల చేసింది. సచివాలయాల సిబ్బంది ద్వారా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 2,35,486 మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాకవరపాలెం మండలం గిడుతూరులో, హోం మంత్రి వంగలపూడి అనిత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులో, కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి మండలం గోపాలపురంలో పలువురు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించారు. అన్ని గ్రామాల్లో కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఊపందుకున్న వరినాట్లు



కోటవురట్ల మండలం జల్లూరులో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

- జిల్లాలో 41,546 హెక్టార్లల్లో పూర్తి
- వ్యవసాయ అధికారి మోహన్‌రావు వెల్లడి

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం సాయంత్రం వరకు 41 వేల 546 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు వారాల నుంచి కురుస్తున్న వర్షాలతోపాటు చెరువుల్లో నీరు చేరడంతో వరినాట్లు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. వరి రైతులకు 3,500 టన్నుల యూరియా అవసరం కాగా 1,111 టన్నుల యూరియా ప్రైవేట్ డీలర్లు, పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో వుంచామని చెప్పారు. ఈ వారం 730 టన్నుల యూరియా కేటాయింపు జరిగిందని తెలియజేశారు. యూరియాను బ్లాక్ చేయకుండా, అధిక ధరలకు అమ్మకుండా విజిలెన్స్, మల్టీ డిసిప్లినరీ టీమ్స్ వారు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

దేవుడి మాన్యాలకు కొరవడిన రక్షణ!

జిల్లాలో 3,008 ఎకరాల దేవదాయ శాఖ భూములు అన్యాక్రాంతం

నకిలీ పత్రాలతో పాగా వేస్తున్న అక్రమార్కులు

- మొక్కుబడి చర్యలతో అధికారులు కాలక్షేపం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో తమ పలుకుబడి ఉపయోగించి భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. ఆలయాల భూములకు సంబంధించిన రికార్డులను తారుమారు చేస్తూ ఆయా భూముల్లో పాగా వేస్తున్నారు. నకిలీ పత్రాలను సృష్టించి ఆలయ భూములకు నిజమైన హక్కుదారులం తామే అంటూ కోర్టులను ఆశ్రయించి సొంతం చేసుకొనే ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరికొందరు కబ్జాదారులు ఆలయాల భూములకు తమ పేరున నకిలీ రికార్డులు సృష్టించి బయట వ్యక్తులకు అమ్ముకుంటున్నారు.



అనకాపల్లి పూల్‌బాగ్ వద్ద విశాఖ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించిన దేవదాయ శాఖ అధికారులు (ఫైల్ ఫొటో)



సీతారామచంద్రస్వామి ఆలయ భూముల వద్ద ప్రైవేటు రక్షణ సిబ్బంది

జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో చిన్నా, పెద్ద ఆలయాలు కలిపి మొత్తం 720 ఉండగా వీటికి సంబంధించి 287 గ్రామాల్లో 5,746 ఎకరాల భూములు ఉన్నాయి. అనకాపల్లి, ఎలమంచిలి, మాడుగుల, దేవరాపల్లి, మునగపాక, నక్కపల్లి మండలాల్లో దేవదాయ శాఖకు ఎక్కువ భూములు ఉన్నాయి. దేవదాయ శాఖ రికార్డుల ప్రకారం జిల్లాలో 3,008 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్టు ఫిర్యాదులు నమోదయ్యాయి. సుమారు 1,350 ఎకరాలను కౌలుకు ఇచ్చినట్టుచెబుతున్నారు. మాడుగులలో పలు దేవాలయాలకు వందలాది ఎకరాల భూములు ఉన్నట్టు రికార్డులు చూపుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో ఈ భూములు అన్యాక్రాంతం అయినట్టు ఇటీవల వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవదాయ శాఖకు చెందిన సుమారు 200 ఎకరాలకు సంబంధించి ఆక్రమణదారులకు దొడ్డిదారిన పట్టాలు జారీ చేశారు. దీనిపై కొందరు కూటమి నేతలు ఫిర్యాదు చేయడంతో విచారణ జరుగుతున్నది.

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం సర్వే నంబర్ 633/2 లో ఒక ఎకరా 94 సెంట్లు, సర్వే నంబరు 633/3లో ఐదు ఎకరాల 23 సెంట్ల ఆలయ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో బోర్డు ఏర్పాటు చేశారు. అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి సమీపంలో పూల్‌బాగ్ సర్వే నంబర్ 66లో 29 ఎకరాల 79 సెంట్ల భూమి విశాఖపట్నంలోని అంబికా బాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి 1957లో చెముడు ఎస్టేట్ మహారాణి వైరిచర్ల చంద్రమణి దానం చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ భూములను గతంలో కౌలుకు తీసుకున్న వ్యక్తులు సొంతం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు ఈ భూములపై స్థానికులు కొందరు ఇనాం కోర్టులో కేసు దాఖలు చేశారు. దీనిపై దేవదాయ శాఖ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంతో స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయినప్పటికీ ఆక్రమణదారులు ఆ భూమిలోకి చొరబడే ప్రయత్నాలు చేస్తుండడంతో దేవదాయ శాఖ అధికారులు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

దేవరాపల్లి మండలం మారేపల్లిలో దేవదాయ శాఖకు చెందిన 23 ఎకరాల 15 సెంట్ల భూమిని కొందరు నకిలీ పత్రాలు సృష్టించి, ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి విక్రయించారు. సదరు ... మిగతా 8వ పేజీలో

వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలి

- క్యాన్సర్‌ను నియంత్రించేందుకు నడుంబిగించిన ప్రభుత్వం
- వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

-8లో

కాజ్‌వేను పునరుద్ధరించరా?

- విజయరామరాజుపేట వద్ద రెండు వారాల క్రితం కొట్టుకుపోయిన లోతట్టు వంతెన
- గౌరీపట్నం మార్గంలోకి వాహనాలు మళ్లింపు
- ఇరుకు రోడ్డు కావడంతో స్తంభిస్తున్న ట్రాఫిక్
- కాజ్‌వే పునరుద్ధరణ పనులు చేపట్టని అధికారులు



గౌరీపట్నం మార్గంలో రాకపోకలకు ఇక్కట్లు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు



విజయరామరాజుపేట వద్ద తాచేరు వరద ఉధృతికి రెండు వారాల క్రితం కొట్టుకుపోయిన కాజ్‌వే.. సోమవారం సాయంత్రం పరిస్థితి ఇది!

చోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చోడవరం-వడ్డాది మధ్య బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరు నది వరద ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోయి రెండు వారాలు దాటినప్పటికీ అధికారులు ఇంతవరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలను గౌరీపట్నం మీదుగా మళ్లించారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల నుంచి చోడవరం మీదుగా బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, చుట్టుపక్కల మండలాలకు వెళ్లే వాహనదారులు గౌరీపట్నం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గం సింగిల్ రోడ్డు కావడం, వాహనాల రద్దీ బాగా పెరగడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభిస్తున్నది. కొన్నిచోట్ల రెండు వ్యాన్లు ఎదురైతే తప్పుకునే అవకాశం లేకపోయింది. ఏమాత్రం పక్కకు దిగినా.. బురదలో కూరుకుపోవడమో, లేకపోతే పొలంలోకి బోల్తా పడడమో జరుగుతుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు ... మిగతా 8వ పేజీలో

స్వయంభూ విఘ్నేశ్వరునికి భస్మాలంకరణ



భస్మ వర్ణంలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం చోడవరం విఘ్నేశ్వరాలయంలో స్వయంభూ గణేశుడు భస్మ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలుచేశారు.

-చోడవరం/ ఆంధ్రజ్యోతి

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి
- ఎంపీ సీఎం రమేశ్
- కశింకోట, తేగాడ స్కూళ్లలో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ప్రారంభం



కశింకోట బాలికల ఉన్నత పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ప్రారంభించిన ఎంపీ సీఎం రమేశ్. చిత్రంలో కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు ఉన్నారు.

కశింకోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. కశింకోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తేగాడ కేజీబీవీలో ఓఎన్‌జీసీ సీఎస్‌ఆర్ నిధులు రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్‌లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, జీవితంలో అత్యంత విలువైన ఆస్తి విద్య అని, ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకుంటే సమాజంలో ఎంతో మార్పు వస్తుందని అన్నారు. విద్యార్థులు స్మార్ట్ క్లాస్ రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ ... మిగతా 8వ పేజీలో

నేడు రెండో దఫా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- విమల విద్యాలయంలో ఏర్పాట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులల్లో మరికొందరి సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో చేపట్టనున్నారు. దీనికి సంబంధించి పాఠశాల విద్యా శాఖ నుంచి జిల్లా విద్యా శాఖకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసింది. ప్రతి కౌంటర్‌లో 50 మంది చొప్పున సుమారు 300 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావలసిన అభ్యర్థులకు కాల్‌లెటర్లు సోమవారం రాత్రికి అందే అవకాశం ఉంది. డీఎస్సీ మెరిట్ జాబితా మేరకు ఉమ్మడి జిల్లాలో 1,139 పోస్టులకుగాను 1,138 మంది అభ్యర్థులు, జోన్-1లో 304 పోస్టులకు 304 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన గత నెల 25వ తేదీ నుంచి మూడురోజులపాటు విమల విద్యాలయంలో నిర్వహించారు. అయితే కొందరు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికయ్యారు. దరఖాస్తు చేసుకునే సమయంలోనే పోస్టులకు సంబంధించి ప్రాధాన్యతా క్రమంలో ఆప్షన్ ఇచ్చారు. దీని ప్రకారం ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికైతే...దరఖాస్తులో ఇచ్చిన ఆప్షన్ మేరకు ఒక పోస్టును ఎంపిక చేసుకోవాలి. తొలివిడత సర్టిఫికెట్ల పరిశీలనలో అటువంటి అభ్యర్థులు ఒక పోస్టు ఎంపిక చేసుకున్న తరువాత మిగిలిన పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపికకు తాజాగా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. కాగా మంగళవారం ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లుచేశామని డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

మళ్లీ వర్షాలు

అల్పపీడనంగా బలపడనున్న ఉపరితల ఆవర్తనం

- జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం

అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు



పరవాడలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో ఆదివారం ఆవరించిన ఉపరితల ఆవర్తనం, ఈశాన్య బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తేమగాలులు వీస్తుండడంతో జిల్లాలో పలుచోట్ల సోమవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాతావరణం సాధారణంగానే వుండగా, అనంతరం ఆకాశం మేఘావృతమై జల్లులు మొదలయ్యాయి. అనకాపల్లి, చోడవరం, మాడుగుల, దేవరాపల్లి, కశింకోట మండలాల్లో మోస్తరు వర్షం పడింది. మాకవరపాలెం, సబ్బవరం, ఎలమంచిలి, కె.కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉపరితల ఆవర్తనం మంగళవారం నాటికి అల్పపీడనంగా మారే అవకాశం వుండడంతో రానున్న రెండు రోజులు అనకాపల్లి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం వుండడం, గురువారం వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్ల వద్దని మత్స్యశాఖ హెచ్చరికలు జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు మండల కేంద్రాల్లోనే ఉండి ప్రజలకు అవసరమైన సహాయక ... మిగతా 8వ పేజీలో

చెక్కపై పవన్ కల్యాణ్ రూపం


చెక్కపై రవి చెక్కిన పవన్ కల్యాణ్ రూపం

నక్కపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దార్ల రవి సెప్టెంబరు 2 డిప్యూటీ సీఎం పవన్ జన్మదినం సందర్భంగా చెక్కపై పవన్ కల్యాణ్ రూపాన్ని చెక్కాడు. సుమారు గంటన్నరసేపు శ్రమించి తన అభిమాన హీరో పవన్ కల్యాణ్ రూపాన్ని చెక్కపై చెక్కి, తన కళానైపుణ్యతతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశాడు.

మంగళగిరిలో ఎమ్మెల్యే సుందరపు అర్జీలు స్వీకరణ


మంగళగిరి అర్జీలు స్వీకరిస్తున్న సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జనవాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అధికారులపాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో అన్న సమారాధన

అచ్యుతాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రుల్లో భాగంగా అచ్యుతాపురంలో సోమవారం ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. శ్రీకృష్ణ ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధనలో అధికంగా భక్తులు పాల్గొన్నారు. అన్న సమారాధనలో కిల్లాడి తాతబాబు, రమణ, పంచదార్ల చిన్నారావు, నాగు తాతారావు, రవి, సత్తిబాబు సేవలందించారు.

ఆయుర్వేద ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆర్‌డీడీ


ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌డీడీ డాక్టర్ శ్రీనివాసులు

నక్కపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిని సోమవారం మధ్యాహ్నం ఆయుష్ శాఖ విశాఖ జోన్ ఆర్‌డీడీ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, అందుబాటులో వున్న ఆయుర్వేద మందుల వివరాలను డాక్టర్ కె.రఘు వివరించారు. ఆస్పత్రి ఆవరణలో పెరుగుతున్న ఔషధ మొక్కలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయుర్వేద వైద్య సేవలు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌డీడీ కె.శ్రీనివాసులను డాక్టర్ కె.రఘు, ఫార్మసిస్ట్,యోగా టీచర్లు డీఎస్ వీ సాయి, డీ రాంబాబు సత్కరించారు.

ఆకట్టుకున్న గణపతి ముగ్గు, దీపాలంకరణ


ధర్మవరం సచివాలయ వీధిలో వేసిన వినాయక ముగ్గు,దీపాలంకరణ

ఎలమంచిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరం వార్డు సచివాలయం వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం స్థానిక మహిళలు రంగులతో వేసి గణపతి ముగ్గు, చుట్టూ దీపాలంకరణ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల చిడతల భజన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం

మునగపాక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. మునగపాకలో రోడ్లపైనుంచి వర్షం నీరు వరదలా పారింది. సంతబయలు చెరువును తలపించే విధంగా నీరు చేరింది. ఇప్పటికీ నీటి ముంపులో ఉన్న వరినాట్లుకు, ఆకుమడత తెగులు సోకి నష్టం ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు.

కోరుప్రోలులో యూరియా పంపిణీ


కొరుప్రోలు పీఏసీఎస్ వద్ద రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రామకృష్ణ, తదితరులు

ఎస్. రాయవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు పీఏసీఎస్‌లో యూరియాను సోమవారం సొసైటీ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పీఏసీఎస్‌లో 600 బస్తాల యూరియా ఉందని, వ్యవసాయ అవసరాల నిమిత్తం రైతులు యూరియా పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, సొసైటీ డైరెక్టర్లు, కార్యదర్శి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎలమంచిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులపర్తి, లక్కవరం గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పులపర్తి ఎరువుల దుకాణంతోపాటు, లక్కవరం పీఏసీఎస్ గోదాములోని స్టాకును పరిశీలించారు. విజిలెన్స్ అధికారులు శంకర్‌లాల్ నాయక్, శంకర్ గోవింద, వ్యవసాయాధికారి మోహనరావు తనిఖీల్లో పాల్గొని ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- పెనుగొల్లులో పెన్షన్‌లు పంపిణీ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమం, అభివృద్ధి అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెనుగొల్లు గ్రామంలో సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే హోం మంత్రి అనిత లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత ప్రతి నెలా సమయానికి పెన్షన్ అందుతుందా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పలువురు డ్రైనేజీ నిర్మించాలని కోరడంతో మంత్రి వెంటనే స్పందిస్తూ డ్రైనేజీ నిర్మాణానికి కావలిసిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన హోం మంత్రి అనితకు స్థానిక సీనియర్ నాయకులు ప్రగడ తులసి, గోరింట్ల ఆశ, పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనితకు స్థానిక మహిళలు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

అర్హులకు పించన్లను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. పట్టణంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పేషెంట్‌కి ఈనెల కొత్తగా మంజూరైన రూ.10 వేలు పెన్షన్‌ని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబుతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి రాఘవ, వార్డు సభ్యుడు మలిపెద్ది వెంకటరమణ, పార్టీ నాయకులు వేములపూడి అప్పారావు, పెదిరెడ్డి నాగవెంకటరమణ, రాజాన ఆది, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

వైసీపీ ప్రభుత్వం పించన్ పథకాన్ని వంచిందని, కూటమి ప్రభుత్వం


నాగవరంలో పింఛన్ అందజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు


పెనుగొల్లులో దివ్యాంగుడికి పెన్షన్ పంపిణీ చేస్తున్న హోం మంత్రి అనిత

అద్భుతంగా అమలు చేస్తోందని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలో నాగవరం గ్రామంలో సోమవారం పించన్లను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కేవలం రూ.250లు చొప్పున పెంచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు పాలిపిని శ్రీనివాసరావు, పాలిపిని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అర్హులకు పెన్షన్‌లో కోత ఉండదని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలో రామన్నపాలెంలో ఎమ్మెల్యే సుందరపు, ఇరువాడలో ప్రగడ నాగేశ్వరరావు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ కూటమి ప్రభుత్వం పెన్షన్‌లు ఇస్తుందని, ఇందులో ఎవరూ ఎటువంటి అపోహలు పడవద్దన్నారు. ఈ కార్యక్రమాల్లో డ్రీమ్స్ నాయుడు, లాలం సత్తిబాబు, ధర్మిరెడ్డి అప్పారావు, మామిడి శివ అప్పారావు, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


రామన్నపాలెంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


ఎలమంచిలిలో డయాలసిస్ రోగికి పెన్షన్ అందజేస్తున్న పప్పల చలపతిరావు

రాంబిల్లిలో..

అర్హులందరికీ ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అన్నారు. సోమవారం ఆయన హరిపురంలో పేదలకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెల 1న తేదీనఅర్హులైన వారందరికీ ఇంటి వద్దే పెన్షన్లు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హరిపురం పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు ధూళి అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి గంగరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. సోమవారం మునిసిపాలిటీతో పాటు మండలంలోని అన్ని ప్రాంతాల్లోనూ కూటమి నేతలు ఇంటింటికి వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. మునిసిపాలిటీ నెహ్రూనగర్‌లో పప్పల చలపతిరావు పెన్షన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని, ఇది మంచి ప్రభుత్వమన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలెండర్లు , రైతు భరోసా పథకాలను అమలు చేస్తున్నదన్నారు. అదేవిధంగా పురుషోత్తపురంలో టీడీపీ నేతలు కొలుకులూరి విజయ్ బాబు, రాజాన వెంకునాయుడు, కొక్కిరాపల్లిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, యర్రవరంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కరణం రవికుమార్, తులసీనగర్‌లో ఆడారి రమణబాబు, పోతిరెడ్డి పాలెంలో సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, ఏటికొప్పాకలో మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి పెన్షన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నేతలు బొద్దపు శ్రీను(రమణ), కరెడ్ల మల్లి, నూకరాజు, డి.రమేష్, గొర్లె బాబూరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవ ఆంధ్రప్రదేశ్ నిర్మాత చంద్రబాబు : ప్రగడ

ఎలమంచిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ నవ నిర్మాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సెప్టెంబరు ఒకటో తేదీన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు అయిన సందర్భంగా ప్రగడ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ ఖ్యాతి నార్జించేలా శ్రమించారన్నారు. మూడు దశాబ్దాల కాలంలో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఆయన తెచ్చిన 30 అతి కీలకమైన పథకాలు, కార్యక్రమాలు, సంస్కరణలు ఉమ్మడి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి వైపు నడిపించాయన్నారు. దేశంలోనే సంచలనం ప్రజల వద్దకే పాలన, ప్రజల భాగస్వామ్యంతో జన్మభూమి కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు. ప్రజా చైతన్యంతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారన్నారు. బాలికా విద్య, మహిళలకు దీపం పథకం ద్వారా పనిముట్లు అందించారన్నారు. ఎస్సీల రక్షణ కోసం పున్నయ్య కమిషన్ సూచనలు అమలు చేశారన్నారు. బీసీ మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ సదుపాయం, డ్వాక్రా మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఐటీ రంగానికి ఎనలేని ప్రాధాన్యతనిచ్చి హైటెక్ సిటీ నిర్మాణం చేశారన్నారు. పెద్ద ఎత్తున ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు కృషి చేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు. 2020లో పాలనకు కొత్త రూపు తెచ్చారన్నారు. అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చారని, రియల్‌టైం గవర్నెన్స్‌తో పారదర్శకమైన పాలన, అందించారన్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, సైబరాబాద్‌లను నిర్మించారన్నారు. ఇప్పుడు ఏపీ రాజధానిగా అమరావతి నిర్మాణం చేపట్టారని, పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. గత 30 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎన్నో చారిత్రాత్మక పథకాలు ప్రవేశపెట్టారన్నారు.


ప్రగడ నాగేశ్వరరావు

పరిశుభ్రతతో వ్యాధులకు దూరం

నక్కపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రత, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం వల్ల అనేక వ్యాధులు రాకుండా జాగ్రత్తపడవచ్చునని గొడిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీ సువర్ణ సంధ్య చెప్పారు. మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఆరోగ్య సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం వి.బాలాజీ, ఉపాధ్యాయుడు వైవీ రమణ పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో అక్రమ నిర్మాణం తొలగింపు


ప్రహరీ గోడను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పాయకరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజుగారిబీడులో రూ.1.5 కోట్ల విలువైన పంచాయతీ స్థలంలో ఆక్రమణదారులు నిర్మించిన ప్రహరీగోడను సోమవారం అధికారులు తొలగించారు. స్థానిక రాజుగారిబీడులో 1984లో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి కేటాయించిన కమ్యూనిటీ స్థలం చుట్టూ బయటి వ్యక్తులు ప్రహరీగోడ నిర్మించిన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో వార్తలు రావడంతో రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించి, అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడ తొలగించాలని ఆదేశించారు. దీంతో సోమవారం డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడను తొలగించి, స్థలంలో పంచాయతీ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ హోం మంత్రి అనిత, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు రాజుగారిబీడులోని పంచాయతీ స్థలంలో ప్రహరీగోడను తొలగించామన్నారు. మరోమారు ఆక్రమణ జరగకుండా పెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. పంచాయతీలో వేసిన లేఅవుట్లలోని పంచాయతీకి కేటాయించిన స్థలాల్లో ఆక్రమణలుంటే తొలగించి పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. పంచాయతీ స్థలంలో ఆక్రమణలు తొలగించడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేబాక సర్పంచ్‌కు కంబాల జోగులు పరామర్శ

నక్కపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనును సోమవారం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. ఇటీవల సర్పంచ్ శ్రీను తండ్రి రమణ మరణించారు. ఈ మేరకు రేబాక గ్రామంలో సర్పంచ్ నివాసానికి కంబాల జోగులు, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, పొడగట్ల పాపారావు, వెలగా ఈశ్వరరావు, గొర్ల గోవింద్, తళ్లా భార్గవ్,మనబాల తాతారావు తదితరులు వెళ్లారు.

'పంచాయతీ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలి'

పాయకరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజుగారిబీడులోని సర్వే నంబరు.192, 193లలో వేసిన లేఅవుట్లలో ఆక్రమణలకు గురైన పంచాయతీ స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకోవాలని పట్టణానికి చెందిన జగతా నాగరాజు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్, పాయకరావుపేట పంచాయతీ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ఇప్పటివరకు వేసిన లేఅవుట్లలోని పంచాయతీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజుగారిబీడులో సర్వే నంబరు.192, 193లలో వేసిన రెండు లేఅవుట్లలో పంచాయతీకి కేటాయించిన 40 సెంట్ల స్థలాలు అన్యాక్రాంతమైన ఇతరులకు అమ్మకాలు కూడా జరిగాయన్నారు. దీనిపై గతంలో వార్డు సభ్యులు, స్థానికులు స్పందనలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరారు.

కొక్కిరాపల్లి అభివృద్ధికి ప్రతిపాదనలు

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌ను కలిసిన ప్రగడ, కౌన్సిలర్

ఎలమంచిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలో వెనుకబడిన కొక్కిరాపల్లి వార్డు అభివృద్ధికి రూ.కోటితో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నివేదికను సోమవారం విశాఖలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌కు రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, కౌన్సిలర్ రామకృష్ణ అందజేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఇటీవల 23వ వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ మూడు రోజులు పాటు ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. దీంతో మునిసిపల్ మంత్రి నారాయణ, స్థానిక నేతలు ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావుల హామీతో దీక్ష విరమించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో కొక్కిరాపల్లి వార్డు అభివృద్ధికి కోటి రూపాయలు కేటాయిస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం కొక్కిరాపల్లి నుంచి రెల్లి కాలనీకి రూ.50 లక్షల వ్యయంతో రహదారి, వార్డులో రూ.50 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టేందుకు అంచనాలు తయారు చేసి వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు నివేదిక ఇచ్చారు. కార్యక్రమంలో కొక్కిరాపల్లి కౌన్సిలర్ రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, వార్డు నేతలు మజ్జి వీరబాబు, పాలరౌతు గణేష్, తదితరులు పాల్గొన్నారు.


వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు ప్రతిపాదనలు అందజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, కౌన్సిలర్ రామకృష్ణ

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు తొలిసారి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని వేంపాడులో ఆయన ఫొటోకు పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు కమ్మిల శివ రామకృష్ణంరాజు, ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు తదితరులు కేక్ కట్ చేశారు. సీఎం చంద్రబాబు రాజకీయాల్లో అపర చాణుక్యుడని, రాష్ట్రం కష్ట సమయంలో వున్నప్పుడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో పల్లా రాంబాబు, కళ్లేపల్లి వెంకటపతిరాజు, డి. సూర్యనారాయణరాజు, కమిడి బాబూరావు, దారబాల బుజ్జి పాల్గొన్నారు.

'హోం మంత్రి దృష్టికి పాఠశాల సమస్యలు'


చిట్టిబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజానగరం ప్రాథమిక పాఠశాల సమస్యలను రాష్ట్ర హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ నాయకుడు పెదిరెడ్డి ట్టిబాబు అన్నారు. సోమవారం రాజానగరం వెళ్లిన ఆయనకు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాఠశాల సమస్యలను వివరించారు. పాఠశాలకు ప్రహరీ గోడ, బాత్‌రూమ్‌లు, డ్రింకింగ్ వాటర్ సదుపాయాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథ్, చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, పారా గాలిబాబు, వంకా శివకుమార్, వంకా హరి, మల్లె రాంబాబు, మేరుగు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హెటెరో కెమికల్ భవనాన్ని ఆపండి

- కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు

నక్కపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత, న్యాయంపూడి గ్రామాలకు ఆనుకుని హెటెరో ఔషధ పరిశ్రమ యాజమాన్యం అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న కెమికల్ భవనాన్ని వెంటనే నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో నిరాహారదీక్ష చేపడతానని కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు హెచ్చరించారు. సోమవారం తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజులకు జనసేన నేతలతో కలిపి ఆయన ఫిర్యాదు చేశారు. హెటెరో ఔషధ పరిశ్రమ పంచాయతీల తీర్మానం, గ్రామసభల ఆమోదం లేకుండా ప్రమాదకరమైన గ్యాస్/రసాయనాలను నిల్వ చేసే గొడౌన్‌లను నిర్మిస్తోందని చెప్పారు. తమ ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా కలుషితమైపోతాయని, మహిళలు, గర్భిణులకు తీవ్ర అనారోగ్య పరిస్థితులు సంభవిస్తాయని ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. ఇప్పటికే హెటెరో పరిసర గ్రామాల్లో అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, తమ గ్రామాలకు ఆనుకుని అక్రమంగా నిర్మిస్తున్న రసాయన భవనం నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరారు ఈ వినతి పత్రాలు ఇచ్చిన వారిలో జనసేన నాయకులు కురందాసు అప్పలరాజు, యలమంచిలి చంద్రరరావు, బంగారి రాజు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు

నక్కపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల బీసీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం రాత్రి ఆ గ్రామ కూటమి నాయకులు పరిశీలించారు. మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, నల్లల రత్నాజీ, నాని, సాయి, పేకేటి సాయి, చరణ్ తదితరులు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా అని ఆరా తీశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం నాణ్యమైన బియ్యంతో భోజనం పెడుతున్నారని చెప్పారు. పిల్లలు బాగా చదువుకోవాలని వైబోయిన రమణ సూచించారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

రాంబిల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోరును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల మండల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు అందించకుండా మోసం చేసిందన్నారు. ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నారని దేముడునాయుడు తెలిపారు.

అచ్యుతాపురంలో..

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని దోసూరు, తిమ్మరాజుపేటల్లో భవన నిర్మాణ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనెల 15న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో రాజాన అప్పల నాయుడు, రాజు, వసంత, చిట్టిబాబు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ వచ్చే.. ఇంటికే పింఛన్ ఇచ్చే..

▸ ఉదయం నుంచి వీధి వీధినా సందడి వాతావరణం ▸ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల వెళ్లి పంపిణీ చేసిన కూటమి నాయకులు, అధికారులు ▸ అవ్వాతాతల మోములో ఆనందం


అనకాపల్లి ఉడ్‌పేటలో పింఛన్ నగదు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి టౌన్/కొత్తూరు/తుమ్మపాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం సందడి వాతావరణంలో సాగింది. ఉదయం నుంచి కూటమి నాయకులతో పాటు అధికారులు ఆయా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదును అందజేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనన్నారు. అలాగే, చినరాజుపేట సాంబశివుని గుడి ప్రాంతంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, 81వ వార్డు పరిధి గవరపాలెం పార్కు సెంటర్, సంతోషి మాత ఆలయం, సాయి సుబ్బరాజువీధి, నెయ్యిల వీధి, వేగి వీధి ప్రాంతాల్లో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మసీదు వీధి, మళ్ల వీధిల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పింఛన్ల నగదును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయ కులు పాల్గొన్నారు. చవితిన వీధిలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. చినరామస్వామి కోవెల, దేవుడుతోట, విల్లూరి జోగినాయుడువీధి తదితర ప్రాంతాల్లో బొడ్డేడ మురళీ ఆధ్వర్యంలో 80వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సత్యనారాయణపురం, పిసినికాడ పంచాయతీల పరిధిలో ఉన్న పిసినికాడ, కొత్తూరు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద పలువురికి పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, తుమ్మపాలలో కొత్తగా మంజూరైన పింఛన్లను టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి పంపిణీ చేశారు. పంచాయతీ ఈవో ఈశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి, మాసవరపు అప్పలనాయుడు, కూటమి


పరవాడ మండలం తానాంలో పింఛన్ అందిస్తున్నఎమ్మెల్యే పంచకర్ల

నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...


సబ్బవరం : సామాజిక పింఛన్ల పంపిణీలో సబ్బవరం మొదటి స్థానంలో నిలిచిందని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ నారాయణరావు తెలిపారు. మండలంలో 8123 సామాజిక పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సోమవారం 7803 మందికి అందజేసినట్టు చెప్పారు. కాగా ప్రభుత్వం అనర్హులుగా తేల్చి, నిలిపివేసిన 232 మందిలో అప్పీలు చేసుకున్న 200 మందికి పింఛన్ నగదు అందజేశామన్నారు. అలాగే, నలుగురు వితంతువులు , మరో ఇద్దరు వృద్ధులకు కన్వర్షన్ చేసి పింఛన్లను పునరుద్ధరించినట్టు చెప్పారు.

కాంగ్రెస్ నేతలపై పోలీసులకు బీజేపీ నాయకుల ఫిర్యాదు


సీఐకు ఫిర్యాదు కాపీని అందిస్తున్న బీజేపీ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తల్లిని దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, ఆ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ పట్టణ సీఐ టీవీ విజయ్ కుమార్‌కు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ పర్యటనలో మోదీ తల్లిపై రాజీవ్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. వెంటనే మోదీకి ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పలకా రవి, ఓరుగంటి నాగమణి, మారిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

126 అడుగుల గణపతిని దర్శించుకున్న మంత్రి, ఎంపీ


గణనాథుడ్ని దర్శించుకున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవ రాత్రి ఉత్స వాల్లో భాగంగా పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన 126 అడుగుల గణనాథుడ్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం రాత్రి దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో వీరంతా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అనకాపల్లిలో ఇంత పెద్ద ఎత్తున స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ద భూలోకనాయుడు తదితరులు సత్కరించి చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరుతూ పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్‌కు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఆదాయం కోల్పోయారన్నారు. వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేలు మంజూరు చేయాలని, ప్రమాదాల్లో, అనారోగ్యంతో మరణించిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు, అంగవైకల్యం ఏర్పడిన ఆటో కార్మికులకు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదిరెడ్ల నాగేశ్వరరావు, కోరిబిల్లి జగదీశ్‌లు విన్నవించారు. అలాగే, అధిక జరిమానాలతో కూడిన జీవో నెంబరు 21, 31లను రద్దు చేసి ఆటో, ముఠా కార్మికులను ఆదుకోవాలన్నారు. ఫెడరేషన్ నాయకులు డి.మార్కండేయులు, నూరిశెట్టి బాపునాయుడు, మంగ నాయుడు, కొణతాల రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు


బహుతులను అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్, సీఐ మల్లికార్జునరావు

లంకెలపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగిన ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. మొత్తం 27 జట్లు తలపడగా, ఫైనల్స్ అచ్యుతాపురం, పరవాడ జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ప్రథమ స్థానంలో అచ్యుతాపురానికి చెందిన అల్లూరి జట్టు, ద్వితీయ స్థానంలో పరవాడ జట్టు నిలిచాయి. వీరితో పాటు తృతీయ, చతుర్థ స్థానాల్లోని జట్లకు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, పరవాడ సీఐ మల్లికార్జునరావు చేతుల మీదగా నిర్వాహకులు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఆర్ యూత్ ప్రతి నిధులు నారపిన్ని కిశోర్, దాసరి జగదీశ్, నరసింగరావు, ఉమేశ్, సతీశ్ కర్రి నరేంద్ర, మోహన్, దత్తు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ

పరవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నూరు, కలపాక, పెదముషిడివాడ పంచాయతీలకు చెందిన పలువురికి సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, సర్పంచ్ కన్నూరు దేవి, కూటమి నాయకులు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, కన్నూరు వెంకటరమణ, వర్రి పరదేశినాయుడు, కరణం నరసింగరావు, వియ్యపు చిన్న పాల్గొన్నారు.

అనకాపల్లి డీటీగా శాంతిభూషణరావు బాధ్యతలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయ డీటీగా శాంతిభూషణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాయకరావుపేట నుంచి ఇక్కడకు బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న శ్రీరామ్మూర్తి బుచ్చెయ్యపేట మండలానికి బదిలీ అయ్యారు.

భవిత కేంద్రం నేమ్ బోర్డు ఆవిష్కరణ

పరవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ మండల పరిషత్ కార్యాలయ జంక్షన్‌లో గల భవిత కేంద్రానికి సంబంధించిన నేమ్ బోర్డును సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. భవిత కేంద్రానికి నేమ్ బోర్డు లేకపోవడంతో ఓనర్స్ ఫౌండేషన్ సభ్యులు నేమ్ బోర్డు, రహదారి పక్కన స్కూల్ జోన్ సూచించే బోర్డులను తయారు చేయించారు. మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమా, ఎంఈవోలు ఎం.దివాకర్‌రావు, వి.సాయిశైలజా, ఓనర్స్ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో క్రీడలను ప్రోత్సహించాలి : జేసీ జాహ్నవి



అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడలను ప్రోత్సహించి మంచి క్రీడాకారులను తయారు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా క్రీడాభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుత విజయాలను సాధిస్తారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గుచూపే విధంగా జిల్లాలోని 24 మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. పికెల్ బాల్ కోర్టు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్‌ను ఆదేశించారు. అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలో భూమిని సేకరించి స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని ఆయా మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలోని గుర్తించిన 16 మండల కేంద్రాలకు 12 మండలాల్లో 25 సెంట్లు చొప్పున స్థలాన్ని సేకరించడం జరిగిందన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో కోర్టులు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని జడ్పీ సీఈవో నారాయణమూర్తికి ఆమె సూచించారు. అలాగే అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, మున్సిపాలిటీల పరిధిలో కూడా బ్యాడ్మింటన్ కోర్టుల ఏర్పాటుకు అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేసి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గండి బాబ్జీ జన్మదిన వేడుకలు


సబ్బవరంలో గండి బాబ్జీ జన్మదిన వేడుకల్లో కేక్ కట్‌చేసి మాట్లాడుతున్న వంశీదీప్, హాజరైన టీడీపీ నాయకులు, అభిమానులు


పరవాడ మండలం గొర్లివానిపాలెంలో కేక్ కట్‌చేసి మాజీ ఎంపీపీ జగన్నాథరావుకు తినిపిస్తున్న గండి వంశీ

సబ్బవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ జన్మదిన వేడుకలను సోమవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొగలిపురంలో ఉచిత వైద్య శిబిరం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, పెదనాయుడుపాలెంలో వీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే, రాజుగారి బంజరి వద్ద జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు సాయినాథరావు ఆధ్వర్యంలో బాబ్జీ పుట్టిన రోజు కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. మండల కేంద్రం సబ్బవరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరిగిన సాంస్కృతిక వేడుకల్లో బాబ్జీ తనయుడు గండి వంశీదీప్ కేక్ కట్‌చేసి నేతలకు, కార్యకర్తలకు తినిపించారు. అంతకు ముందు గండి వంశీదీప్, టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు తదితరులు మాట్లాడారు. ప్రజల మనిషి బాబ్జీ అని, ఆయన జీవితం తెరచిన పుస్తకం అని పేర్కొన్నారు. ముత్యాలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు గండి దేముడు, నేతలు భర్నికాన సాయినాథరావు, మొల్లి ముత్యాలనాయుడు, కొటాన అప్పారావు, పల్ల తాతారావు, దాసరి రమణ, బొండా సత్యారావు, రేసుపూడి రమణ, కోరాడ శ్రీను, రొంగలి దేముడు, పడాల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, ప్రసాద్, వడిసల రమేశ్, బొండా కళ్యాణ్, గుజ్జా శ్రీను, బలిరెడ్డి బంగారునాయుడు, గొంప అశోక్, వియ్యపు చిన్నా, ఆడారి నాగరాజు, బొబ్బరి కన్నారావు, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొర్లివానిపాలెం టీడీపీ కార్యాలయంలో...

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత జన్మదిన కేక్‌ను గండి వంశీ కట్‌చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, రాయవరపు దేముడు, జనపాల రాము, నగిరెడ్డి చిన్నారావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భరిణికం అనాథ శరణాలయం పిల్లలకు వాడచీపురుపల్లి గండి బాబ్జీ యువసేన ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాలను ఏర్పాటు చేశారు. వాలీబాల్ నెట్, షటిల్ బ్యాట్‌లతో పాటు స్నాక్స్ అంద జేశారు.

194 మద్యం క్వార్టర్ బాటిళ్లతో ఇద్దరిపై నమోదు

కొత్తూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం సిబ్బందితో వెంకుపాలెం గ్రామ శివారున మాటు వేశామన్నారు. ఇంతలో తుమ్మపాల ప్రాంతానికి చెందిన రామకృష్ణ, సత్యనారాయణ అనే ఇద్దరు వ్యక్తులు గోనె సంచిలో 194 మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. మద్యం బాటిళ్లతో పాటు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

'భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి'


మామిడిపాలెంలో సమావేశం జరుగుతున్న దృశ్యం

▸ వామపక్ష నాయకుల డిమాండ్

తుమ్మపాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికులకు బీమా పరిహారాన్ని చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం డిమాండ్ చేశారు. మామిడిపాలెంలో సోమవారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశంలో మాట్లాడారు. ప్రమాదవశాత్తూ మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల బీమా విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్, మహాలక్ష్మి నాయుడు, మిర్తిపాటి కాశీ, ఆళ్ల శంకరరావు, పీలా రాము, ఈశ్వరరావు, చెల్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. సదరు బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాని కోరారు. నాయకులు పూడి అప్పలనాయుడు, జి.అప్పారావు, ముత్యాల నాయుడు, ఏలూరి శ్రీను, గోపీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఇక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా సీఐయూ నాయకులు దాకారపు శ్రీనిసరావు, జి.అప్పలకొండ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి, నిధులను వివిధ పథకాలకు మళ్లించిందన్నారు. ఎన్నికల ముందు ఈ విషయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు బి.మహేష్, ఆర్.రాము, పి.తాతారావు, సత్యారావు, కె.అప్పారావు, మల్లేషు తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌వోగా బాలకర్ణ



చింతపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యానశాఖ అధికారి(డీఏవో)గా కంటా బాలకర్ణ నియమితులయ్యారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆకునూరి రమేశ్ కుమార్‌రావు ఆదివారం పదవీవిరమణ చేయడంతో ఆయన స్థానంలో బాలకర్ణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ హార్టీకల్చర్, సెరీకల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు మంగళవారం ఆయన డీఏవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

మద్దిగరువు మండల ఏర్పాటుకు కృషి చేయాలి

జి.మాడుగుల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్దిగరువు మండలం ఏర్పాటుకు కృషి చేయాలని మద్దిగరువు మండల సాధన సమితి నాయకులు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు ఎస్పీ ధీరజ్‌లను కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎమ్మెల్యేతోపాటు ఎస్పీని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధికి దూరంగా ఉన్న తమ ప్రాంతానికి మండల కేంద్రం ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతుందన్నారు. 13 పంచాయతీలకు అనువుగా ఉన్న మద్దిగరువును మండలంగా ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.అప్పలరాజు, సర్పంచ్ ఎల్.మాలన్న, మాజీ సర్పంచులు టి.రాంబాబు, వై. పండన్న, మండల సాధన సమితి నాయకులు దయనిధి, రత్నం, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణలో పెసా కమిటీదే కీలక పాత్ర

▸▸ టీడీపీ సీనియర్ నేత ఆనందరావు

చింతపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కులు, చట్టాలు పరిరక్షణకు పెసా కమిటీదే కీలకపాత్ర అని టీడీపీ నేత రీమల ఆనందరావు అన్నారు. సోమవారం చిన్నగెడ్డ పెసా కమిటీ కార్యదర్శిగా ఎన్నికైన వంతల బాలకృష్ణను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో జరిగిన పెసా ఎన్నికల్లో మెజారిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షులు టీడీపీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారన్నారు. ఎన్నికైన నాయకులు గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్కోజు నాగభూషణం, చిన్న, రామకృష్ణ, పెద్ద, అప్పారావు, మంగ్లు, వల్లీ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ఇమ్మానుయేలు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఇమ్మానుయేలు నియమితులయ్యారు. ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు ఆదివారం పదవీ విరమణ చేయడంతో అక్కడే ఏవోగా పనిచేస్తున్న ఇమ్మానుయేలుకు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు సోమవారం ఆయన విధుల్లో చేరారు. నూతన ఎంపీడీవోని ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ సుభద్ర, కోఆప్షన్ సభ్యుడు ఎస్కే దావీదు, గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు సన్మానించారు.

బెర్రీ బోర్రర్ తెగులు కలిపిస్తే సమాచారం ఇవ్వండి

▸▸ ఉద్యాన శాఖ ఏఈవో ధర్మయ్య

చింతపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):కాఫీ తోటల్లో బెర్రీ బోర్రర్ తెగులు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఉద్యానశాఖ, కేంద్రకాఫీ బోర్డు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఉద్యానశాఖ ఏఈవో ధర్మయ్య అన్నారు. సోమవారం బూసులుకోట కాఫీ తోటల్లో గిరిజన రైతులకు కాఫీ బెర్రీ బోర్రర్ తెగులు లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఈవో మాట్లాడుతూ కాఫీ కాయల్లో నల్లని రంధ్రం కనిపిస్తే బెర్రీ బోర్రర్ తెలుగు సోకినట్టు గుర్తించాలన్నారు. మ్యాక్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ పోతురాజు, సర్పంచ్ రాజుబాబు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వినాయక నిమజ్జనం

చింతపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో వినాయక నిమజ్జనాన్ని భక్తులు కన్నులపండువగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని పెదపైపు, నెయ్యిలవీధి, మైలుకూలివీధి, కుమ్మరివీధి, రామాలయం, మెయిన్ రోడ్డు, సబ్ జైల్, పాత బస్టాండ్‌లో కొలువైన గణపతి విగ్రహాలకు భక్తులు భారీ ఊరేగింపు నడుమ నిజ్జనం చేశారు. ఉదయం మండపాల్లో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, వర్తక సంఘం మండలాధ్యక్షుడు జోగేశ్వరరావు, నిర్వాహక కమిటీ సభ్యులు తాటిపాకల నాగేశ్వరరావు, మల్లనాగు, రాజు, గంజారి రమణ, నెల్లూరు నాని పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి బాధ్యులపై చర్యలు చేపట్టాలి

అనంతగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల-1 ఆరో తరగతి విద్యార్థిని కిల్లో అవంతిక మృతికి గల బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. విద్యార్థిని అనారోగ్యానికి గురైతే కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ విషయంలో హెచ్ఎం, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, పాఠశాల నుంచి వ్యర్థాలు గెడ్డలోకి వదిలేయడం నీరు కలుషితమవుతుందని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే వారిపై చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

అనంతగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ కేంద్రంలో మంగళవారం తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇంటింటికీ ఇచ్చిన తడి, పొడి చెత్త సేకరణలో భాగంగా రెండు డబ్బాలను పంపిణీ చేశారని, దాన్ని తడి, పొడి కోసం వేర్వేరుగా ఉపయోగించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరగం గణేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరి రైతులకు రాయితీపై రాజ్‌మా విత్తనాలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిరి రైతులకు 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాజ్‌మా విత్తనాలు 334 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని, మంగళవారం నుంచి అన్ని పంచాయతీల పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, వనభసింగి సర్పంచ్ వి.లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సుబ్బలక్ష్మీ, మాజీ సర్పంచ్ కె.బలరాం పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకారం



పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లను సత్కరిస్తున్న దొన్నుదొర

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): డుంబ్రిగుడ పీఏసీఎస్ చైర్మన్‌గా పాంగి సుబ్బారావు, డైరెక్టర్లుగా గంగాదర్, కేశవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలోని బ్యాంక్ కార్యలయం వద్ద విజయనగరం ఆర్టీసీ రీజియన్ జోనల్ చైర్మన్ ఎస్.దొన్నుదొర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు అధిష్ఠానం గుర్తించి న్యాయం చేస్తుందని దొన్నుదొర పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందించి, వారి అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. నాయకులు ఆనంద్, సుబ్బారావు, స్వామి, సింహాద్రి పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు రద్దు కావు : గిడ్డి ఈశ్వరి



కిండంగిలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ పింఛన్లు తొలగించదని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అన్నారు. సోమవారం కిండంగి పంచాయతీలో ఈశ్వరి, వంతాడపల్లి పంచాయతీలో నాగరాజు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పింఛన్‌లు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో 4 లక్షల పింఛన్‌లు కొత్తగా ఇచ్చిందే తప్ప అర్హులకు పింఛన్లు తొలగించలేదన్నారు. వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, కోఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ డప్పోడి వెంకటరమణ, కిండంగి సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి, టీడీపీ నాయకులు దుంబేరి విశ్వనాథం, బీజేపీ నాయకులు పి.రవికుమార్ పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని జనసేన నాయకుడు మసాడి సింహాచలం అన్నారు. మండలంలోని కోరాపల్లి పంచాయతీలో సోమవారం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. గత ప్రభుత్వంలో మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా పింఛన్ మంజూరు కాలేదని, ఈ ప్రభుత్వంలో పింఛన్ మంజూరు కావడంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎ.సన్యాసినాయుడు, కె.శ్రీనువాసు, ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణపై దృష్టి సారించాలి

▸▸ జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ డాక్టర్.అభిషేక్ గౌడ

పాడేరురూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాల నివారణపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీవో చాంబర్‌లో సోమవారం ఆయన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఎస్ఎన్‌పీ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న ఆహార నిల్వలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సకాలంలో అందుతున్నది? లేనిది అనే విషయమై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సరఫరా చేసే వస్తువుల నాణ్యతగా ఉండాలని, సకాలంలో సరఫరా చేయాలని ఆదేశించారు. గ్రామ ఆరోగ్య పోషకాహార దినాన్ని (వీహెచ్ఎన్‌డీ) మెడికల్, ఐసీడీఎస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 35 పీహెచ్‌సీలలో మినీ ఎన్ఆర్‌సీలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్.టి.విశ్వేశ్వరరావు నాయుడు, ఐసీడీఎస్ పీడీ సీహెచ్.ఝాన్సీబాయి, సీడీపీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుత్తులపుట్టు మండలం సాధించడమే లక్ష్యం

▸▸ మండల సాధన సమితి ప్రతినిధులు



పాడేరులో ర్యాలీ చేపట్టిన గుత్తులపుట్టు మండల సాధన సమితి ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గుత్తులపుట్టు మండలం సాధించడమే లక్ష్యంగా పోరాటాన్ని కొనసాగిస్తున్నామని మండల సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.సూరిబాబు, వి.బాపూజీ స్పష్టం చేశారు. సోమవారం 16 పంచాయతీల ప్రజలతో కలిసి మోదకొండమ్మ ఆలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీని చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదబయలు, పాడేరు, హుకుంపేట మండలాలకు చెందిన 16 పంచాయతీల ప్రజల ఆకాంక్ష మేరకు గుత్తులపుట్టును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.ఆనంద్, టి.మహేశ్వరరావు, పి.సూర్యారావు, పి.చందరరావు, సింహాచలం, నాగేష్, గోపాలపాత్రుడు, సూరిబాబు, బంగారుపడాల్, అప్పలమ్మ పాల్గొన్నారు.

మోదీ తల్లిపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నిరసన



పాడేరులో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తల్లిపై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మతం శాంతకుమారి, రాష్ట్ర గిరిజన మోర్చ అధ్యక్షుడు పాంగి రాజారావు ఆధ్వర్యంలో సోమవారం పాడేరు అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.రవికుమార్, సల్లా రామకృష్ణ, తాంగుల సత్యవతి, డాక్టర్.రాఘవేంద్రరావు, పాపిటి రాజు, లకే అబ్బాయి దొర, కుడుముల వెంకటరమణ, కెజియారాణి, నందోలి ఉమామహేష్, వరలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీపీ



రాజ్‌మా విత్తనాలను అందజేస్తున్న ఎంపీపీ అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గిరిజన రైతులు రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. సోమవారం అంతర్ల రైతు సేవా కేంద్రంలో రాజ్‌మా విత్తనాలను వ్యవసాయ అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాట్లుకు ముందుగానే రాజ్‌మా విత్తనాలను అందజేసిందన్నారు. రైతులకు 90శాతం రాయితీపై విత్తనాలను అందజేయడం జరుగుతుందన్నారు. రైతులందరూ సకాలంలో రాజ్‌మా నాట్లు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బీవీ తిరుమలరావు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత, కూటమి నాయకులు రీమల ఆనందరావు, లక్కోజు నాగభూషణం, అప్పారావు, మంగ్లు, రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు దారమల్లేశ్వరి, బీజేపీ మండలాధ్యక్షుడు సాగిన బాలకృష్ణ పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీతో అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని నుర్మతి సర్పంచ్ టి.సూరిబాబు అన్నారు. సోమవారం పంచాయతీ రైతు కేంద్రంలో రైతులకు ఆయన రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో విత్తనాలు ఎరువులు పంపిణీ చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరావు, వంశీకృష్ణ, పెసా కమిటీ నేతలు వెంకన్నపడాల్, మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఆందోళన

చింతపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ మాకవరపాలెం మండలం శెల్లిపాలెంలో ఏర్పాటు చేసేందుకు జీసీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికే నిర్మాణానికి స్థల పరిశీలన పూర్తి చేశారన్నారు. కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ని గిరిజన ప్రాంతంలో నిర్మించకుండా మైదాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు, జీకేవీధి మండలాల్లో ఏదో ప్రాంతంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ప్రాంతీయ ఆదివాసీలకు ఉపాధి లభిస్తుందన్నారు. మైదాన ప్రాంతాల్లో ప్రాసెసింగ్ చేయడంతో రవాణా ఖర్చు పెరిగిపోతుందన్నారు. కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు గణబాబు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో పేద కుటుంబాలకు భరోసా

▸▸ జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



జీనబాడులో పింఛన్ సొమ్మును అందజేస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

అనంతగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పెంపుతో పేద కుటుంబాలకు భరోసా లభిస్తున్నదని జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని మారుమూల జీనబాడు పంచాయతీ కేంద్రంలో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గిరిజన మహిళలు గిరిజన సంప్రదాయంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం పింఛన్ లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ.. సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పింఛన్లను పెంచి పింఛన్‌దారులు కుటుంబాలకు సీఎం చంద్రబాబు భరోసా కల్పించారని కొనియాడారు. మహిళలకు ఆర్టీసీ బస్సులోని ఉచిత ప్రయాణం కల్పించి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఎంపీడీవో ప్రభాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, నాయకులు లక్ష్మణరావు, నరేంద్ర, వ, సురేశ్, చిరంజీవి, సుందరరావు, చంటి, కృష్ణ, దేముడు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసింది చంద్రబాబే

తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసిన ఘతన సీఎం చంద్రబాబుకే దక్కుతుందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. జీనబాడు పర్యటన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తనలాంటి యువ నాయకులకు ఆయన ఆదర్శమన్నారు. ఐటీ రంగాన్ని తీసుకువచ్చి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. రైతుబజార్లు, డ్వాక్రా సంఘాలు, మీ సేవా కేంద్రాలు తదితర పథకాల ద్వారా నిరుపేదల అండగా నిలిచారని చెప్పారు.

సంస్కరణలకు ఆద్యుడు సీఎం చంద్రబాబు

ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణలకు ఆద్యుడు సీఎం చంద్రబాబు అని విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. చంద్రబాబు సీఎంగా 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా తన స్వగృహంలో సోమవారం పార్టీ నేతలతో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడారు. పాలనా దక్షలు, విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధించడం సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా వెనుకబాటుకు గురిచేయగా, చంద్రబాబు గాడిలో పెడుతున్నారు. ఏడాది పాలనలోనే సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు లకోయ్ మహదేవ్,కిల్లో ఆనందరావు, ఎస్.బొంజిబాబు, వి.కొండయ్య, శెట్టి బాబూరావు, పెట్టెలి దాసుబాబు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో పింఛన్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

డుంబ్రిగూడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరమ పంచాయతీ పరిధి గ్రామంలో విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆనందరావు, సుబ్బారావు, రవి, లావణ్య, భాస్కరరావు, గంగాధర్, బీమరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

సూపర్-50కి విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

పాడేరురూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను సూపర్ 50 కార్యక్రమంలో కోచింగ్ అందించేందుకు సోమవారం మూడు పాఠశాలల్లో స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు తలారిసింగి ఆశ్రమ పాఠశాల నుంచి 168 మంది, లోచలిపుట్టు పాఠశాల నుంచి 140 మంది, శ్రీకృష్ణాపురం బాలికల పాఠశాల నుంచి 230 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు చింతపల్లి, పాడేరు రెండు సెంటర్లుగా విభజించి 50, 50 చొప్పున 100 మంది విద్యార్థులకు కోచింగ్ కేంద్రాల్లో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తారు. ఈ పరీక్ష కేంద్రాలను గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ క్రాంతి కుమార్, పాడేరు, చింతపల్లి, అనంతగిరి ఏటీడబ్ల్యూవోలు పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ప్రసాద్ హామీ

కొయ్యూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్లెపూల చదును ప్రాంతంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి అర్చకుడు నాగసాయి శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు సోమవారం ప్రసాద్‌ను కలిసి అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సలహాలు, సహాయ,సహకారాలను కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ. 2.5 కోట్లు అవసరమని అంచనా వేసినట్టు తెలిపారు. అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్లు రహదారి నిర్మాణం, విద్యుత్, తాగునీటి సరఫరా వంటి ప్రధాన సౌకర్యాల కల్పనపై సేవా సంఘ సభ్యులు ప్రసాద్‌తో చర్చించారు. ఈ విషయమై స్పందించిన ప్రసాద్ ఆలయ నిర్మాణానికి తన వంతు కృషి ఉంటుందని, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనం

సీలేరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీలేరు కుమ్మరవీధిలో ఏర్పాటు చేసిన వినాకుడిని సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. ఐదు రోజుల పాటు వినాయకుని సన్నిధిలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం స్వామి వారి సన్నిధిలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం వినాయకుడిని సీలేరు పుర వీధుల్లో యువకులు, మహిళలు డ్యాన్సులతో ఊరేగించి స్థానిక రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

▸▸ ఈగల్ బృందం ఇన్‌స్పెక్టర్ నాగార్జున

చింతపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఈగల్ బృందం ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున అన్నారు. సోమవారం స్థానిక గిరిజన సంక్షేమశాఖ గురుకుల జూనియర్ కళాశాలలో ఈగల్ బృందం డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే విలువైన జీవితాలు నాశనమైపోతాయన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణ, సాగు, సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. రామేశ్వరం పాల్గొన్నారు.

అద్దరవీధి బురదలో కూరుకుపోయిన వ్యాన్



అద్దరవీధి కల్వర్టు వద్ద కూరుకుపోయిన వ్యాన్

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అద్దరవీధి కల్వర్టు బురదలో సోమవారం వ్యాన్ కూరుకుపోయింది. దీంతో రెండు గంటల పాటు స్థానికులు శ్రమించి ట్రాక్టర్‌తో వ్యాన్‌ను వెలికి తీశారు. అద్దరవీధిలో కొట్టుకుపోయిన కల్వర్టు స్థానంలో ఎస్ఎంఐ అధికారులు తూరులు నిర్మించి మట్టితో పూడ్చిపెట్టారు. కాంక్రీట్ వేయకపోవడంతో ఈమార్గంలో ప్రయాణిస్తున్న 12 గ్రామాల ప్రజల అవస్థలను వివరిస్తూ 'అద్దరవీధి కల్వర్టు బురదమయం' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై ఎస్ఎంఐ అధికారులు కనీసం స్పందించలేదు. మధ్యాహ్నం ఈమార్గంపై ప్రయాణిస్తున్న వ్యాన్ బురదలో కూరుకుపోయింది. కల్వర్టు వద్ద సిమెంట్ కాంక్రీట్ వేయాలని ప్రాంతీయ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డివిజనల్ పీఆర్‌వో రాములుకు సత్కారం



డీఎల్ పీఆర్‌వో పి.రాములు దంపతులను సత్కరిస్తున్న ఐటీడీఏ అధికారులు

పాడేరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాచార శాఖలో డివిజనల్ పీఆర్‌వోగా పనిచేసి పదవీ విరమణ పొందిన పి.రాములు దంపతుల ను సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనం గా సత్కరించారు. డీఎల్‌పీఆర్‌వోగా ఐటీడీఏలో సమాచార శాఖ ఏపీ వోగా చక్కని విధులు నిర్వహించారని ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఏవో హేమలత కొనియాడారు. ఈ సందర్భంగా రాములు దంపతులకు శాలువాలు కప్పి జ్ఞాపికను అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం'

పెదబయలు, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పెదబయలు పీఏసీఎస్ చైర్మన్ నరంజి ప్రసాదరావు చెప్పారు. కిముడుపల్లి పంచాయతీలోని పులుగొంది సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ సభ్యురాలు కాసులమ్మతో కలసి రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని, జగన్ ప్రభుత్వం గిరిజనులను విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఏసుబాబు, దసన్న, కృష్ణ, అప్పలుకొండ, మహేశ్వరి, బాబూరావు, తమ్మన్న, రామారావు, సుందర్‌రావు, సీతన్న, లండు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తుందని టీడీపీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి అన్నారు. దారెల పంచాయతీ పరిధిలో సోమవారం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ విధానం తీసుకువచ్చింది టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో మొదటి రోజు అందరికీ పింఛన్ అందేలా అధికారులు ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

హుకుంపేటలో భారీ వర్షం

హుకుంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడింది. దీంతో ముసురు వాతవారణం ఏర్పడింది. ఈ వర్షం వల్ల రోడ్లు చిత్తడిగా మారాయి. మండల కేంద్రానికి వచ్చిన మారుమూల ప్రజలు వర్షంతో తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం వల్ల వరి పంటకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

ఉపాధి ఉద్యోగుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం!

ఉపాధి హామీ పథకం ఉద్యోగుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. చేపల చెరువులు తవ్వడం ద్వారా వచ్చిన మట్టిని మదుములకు అడ్డంగా వేయడంతో నీటి ప్రవాహానికి అవి కొట్టుకుపోయాయి. దీంతో చెరువు కింద పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

- చేపల చెరువులు తవ్వి మదుములకు అడ్డంగా మట్టి
- ముంపునకు గురైన వరి పొలాలు.. నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని పంచాయతీ పాలకవర్గం, అధికారులు

చీడికాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిపల్లి శివారు ఎన్.కొత్తూరు పోతురాజు చెరువు కింద పల్లం పొలాల్లో ఓ రైతుకు చెందిన సొంత జిరాయితీ పొలంలో ఉపాధి పథకంలో చేపల చెరువులు తవ్వించారు. ఆ మట్టిని మదుమునకు అడ్డంగా వేయడంతో వర్షపు నీరు నిల్వ ఉండడంతో సాగు రైతుల పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో గ్రామానికి చెందిన రెడ్డి తాతబాబు, రామునాయుడు, నాగమణి, లెక్కల నరసింహమూర్తి



ముంపునకు గురైన పంట పొలాలు



మదుము వద్ద వేసిన మట్టి

పొలాల్లో నాట్లు వేయకపోగా, ఇప్పటికే నాట్లు వేసిన రెడ్డి నరసింహనాయుడు, చినరాంబాబు, రామునాయుడు, నాగమణికి చెందిన పొలాల్లో నాట్లు వేసినా అధికంగా వర్షపునీరు, గెడ్డనీరు వచ్చి చేరడంతో ముంపునకు గురయ్యాయి. దీంతో నాట్లు వేయని పొలం, నాట్లు వేసిన పొలంతో పాటు సుమారు రెండున్నర ఎకరాలు ముంపునకు గురయ్యాయి. అలాగే బాపనబంద గెడ్డ నుంచి వచ్చే వరద నీరు వీరసాగరం చెరువులోకి మదుము ద్వారా వెళ్లకుండా పైన సీసీ రోడ్డు వేయడంతో, ఆ నీరు కూడా పొలాల్లోకి వచ్చేస్తున్నది. దీంతో పొలాలు



పొలాల్లో తవ్వించిన చేపల చెరువు

మరింత ముంపునకు గురవుతున్నాయి.

ఈ నీరంతా చేపల చెరువు పక్కన ఉన్న మదుము ద్వారా బయటకు పోయేది. ఉపాధి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మదుమునకు అడ్డంగా మట్టి వేయడంతోనే ముంపునకు గురయ్యాయని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. అయినప్పటికీ పంచాయతీ పాలకవర్గం ప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మదుము దగ్గర వేయించిన మట్టి తీయించడంతో పాటు బాపనగెడ్డ నుంచి వచ్చే నీటికి మదుము ఏర్పాటుచేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై టెక్నికల్ అసిస్టెంట్ మోహన్‌ను వివరణ కోరగా, గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో చెరువు నిర్మాణం చేపట్టామని, ఆ మట్టి మదుమును కప్పివేసినట్టు తన దృష్టికి రాలేదని చెప్పారు. వెంటనే మట్టి తీయించి రైతులకు న్యాయం చేస్తానని ఆయన తెలిపారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 30 అర్జీలు

నర్సీపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో 30 అర్జీలు వచ్చాయి. వీటిని సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి సుధాకర్, తహశీల్దార్ రామారావు స్వీకరించారు. నర్సీపట్నం డాన్‌బాస్కో స్కూల్ వెనక చెరుకూరి మురళీకృష్ణకు చెందిన ఖాళీ స్థలంలో డ్రైనేజీ కాలువ నీరు పేరుకుపోయి దోమల బెడద, పందులు సమస్య అధికంగా ఉందని న్యాయవాది డీవీ రమణ ఫిర్యాదు చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. చెట్టుపల్లికి చెందిన బొల్లాప్రగడ వెంకటరమణ తనకు సంబంధించి బ్రహ్మణ ఇనాం పట్టా స్థలం ఆక్రమించి దుకాణాలు నిర్మిస్తున్నారని, అడిగితే విలేకరిని అని, ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకోమని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం కోర్టు సముదాయం దగ్గర ఉన్న బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని సుర్ల కొండ వినతిపత్రం అందజేశారు.

కష్టపడే కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యం

▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



పీఏసీఎస్ చైర్‌పర్సన్ గౌరీశంకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

చోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని జన్నవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన మజ్జి గౌరీశంకర్‌ను పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, ఇందులో ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ పనిచేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, పార్టీ మండల అధ్యక్షుడు కనిశెట్టి మత్స్యరాజు, నాలుగు మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

26వ వార్డులో పింఛన్ల పంపిణీ



పింఛను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. వార్డులో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము స్వయంగా అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్లు రూ.4 వేలు చేసిందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో మునిసిపాలిటీలో రూ.21 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నూకాలమ్మ ఆలయ చైర్మన్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ భేష్: ఎస్పీ



క్రీడాకారుడు అఖిల్‌ను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పక్కన ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్ పరిధిలో శిక్షణ తీసుకున్న నునపర్తి, అజ్జాపురం గ్రామాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజయాలు సాధించడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు, యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండేలా ఎస్ఐ తారకేశ్వరరావు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. వారిలో క్రీడా స్ఫూర్తి పెంపొందించి పతకాలు సాధించేలా ఎస్ఐ కృషి చేస్తున్నారన్నారు. క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను డీఎస్పీ పి.శ్రీనివాసరావు సోమవారం అభినందించారు.

రీ సర్వేలో తప్పులు సరి చేసుకోండి



రీ సర్వే గ్రామ సభలో మాట్లాడుతున్న డీటీ నూకరాజు

మాకవరపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన రీ సర్వేలో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ నూకరాజు సూచించారు. మండలంలోని పైడిపాల, లచ్చన్నపాలెం గ్రామాల్లో భూముల రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో 3,835 ఎకరాల్లో నాలుగు నెలల వ్యవధిలో రైతుల సమక్షంలో రీ సర్వే పూర్తి చేశామన్నారు. రైతులకు సర్వే రిపోర్టు నోటీసులు అందిస్తున్నామని, తప్పులు ఉంటే సరి చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు, వీఆర్వో చిరంజీవి, టీడీపీ నాయకుడు పోతల రాంబాబు పాల్గొన్నారు.

వైబీ పట్నంలో రేషన్ సబ్ పాయింట్ ఏర్పాటు

రోలుగుంట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్ల పంచాయతీ పరిధిలోని వైబీ పట్నంలో రేషన్ సబ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. కొండశిఖర గ్రామాలైన పెదగరువు, లోసింగి, పెదలోసింగి, పిత్రిగెడ్డ, నిలబంధ గిరిజనులు రేషన్ కోసం రాజన్నపేటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ పాయింట్ ఏర్పాటు చేయడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. కనీసం పది కిలోమీటర్ల దూరం వెళ్లి అనేక ఇబ్బందులు పడుతూ గిరిజనులు రేషన్ తెచ్చుకునేవారు. ఈ ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి పాయింట్ మంజూరు చేశారు. లోసింగి రోడ్డు పనులు పూర్తయ్యే వరకు వైబీ పట్నంలో సబ్ పాయింట్‌ను ఉంచుతామని అధికారులు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



రిటైర్డ్ ఉపాధ్యాయురాలును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని గాదిరాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు దొండపాటి నాగరాజేశ్వరి సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమగ్ర శిక్ష అభియాన్‌తో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్టు చెప్పారు. అంతకుముందు గ్రామంలో ఎమ్మెల్యే బండారు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి లబ్ధిదారులకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, ఎంపీపీ రాజారామ్, టీడీపీ మండల అధ్యక్షుడు సన్యాసిరావు, సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, నాయకులు రమేశ్, ఎ.జగ్గారావు కాంట్రాక్ట్ డ్రాయింగ్ టీచర్ నల్లబిడ్డి నాగరాజు పాల్గొన్నారు.

రక్తదానంలో అందరూ భాగస్వాములు కావాలి

▸ జనసేన సీనియర్ నాయకుడు అప్పన దొరబాబు



రక్తదానం చేస్తున్న నాయకులు అప్పన దొరబాబు, గణేశ్, తదితరులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రక్తదానంలో అందరూ భాగస్వాములు కావాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం సీనియర్ నేత అప్పన దొరబాబు పిలుపునిచ్చారు. గొలుగొండ మండలంలోని ఏఎల్ పురంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పాతకృష్ణాదేవిపేట, లింగంపేట ఉప సర్పంచులు దుంపలపూడి సహదేముడు, లంక సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని దొరబాబు ప్రారంభించారు. కొంగసింగి, నాగాపురం, రామచంద్రపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల జనసేన నాయకులు, యువత, అభిమానులు కలిపి సుమారు 90 మంది రక్తదానం చేశారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ మంగళవారం నర్సీపట్నంలో భారీ బైక్ ర్యాలీతో పాటు ఆసుపత్రిల్లో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నర్సీపట్నం పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేశ్, మండల ఉపాధ్యక్షుడు లంక సత్యనారాయణ, నాయకులు అనిశెట్టి గోపి, ఈర్ని చిన్ని, శివాజీ, శివ, ప్రసాద్, గుణశేఖర్, వత్తల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

రావికమతం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. రావికమతం అక్కన్నచార్యులు ఇంటి సమీపంలో ఈ ఏడాదితో వినాయక మండపం వరుసగా ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తికావడంతో 25 రకాల ఆహార పదార్థాలతో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని యూత్ స్టార్ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే మరుపాక దుర్గానగర్‌లో కూడా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దొండపూడి గట్టువారి వీధిలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





రావికమతంలో 25 రకాల ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు క్యూ కట్టిన భక్తులు



దేవరాపల్లిలోని అన్నసమారాధనలో పాల్గొన్న టీడీపీ నాయకులు

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. సెల్ పాయింట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని అన్న ప్రసాదం స్వీకరించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, సహకార సంఘం అధ్యక్షుడు పూడి సత్యారావు, స్థానిక నాయకుడు డి.శంకర్ పాల్గొన్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలి

ఎంపీ సీఎం రమేశ్‌కు బీజేపీ, కార్మిక సంఘాల నేతల వినతి

చోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలని ఎంపీ సీఎం రమేశ్‌కు బీజేపీ, గోవాడ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి కార్యాలయంలో సోమవారం ఎంపీని వారు కలిశారు. ఈ సీజన్‌లో క్రషింగ్ జరిగేలా చూడాలని కోరారు. ఎన్‌సీడీసీ రుణం మంజూరు చేయించి ఫ్యాక్టరీని నిలబెడితే రైతులు, కార్మికుల జీవితాలు బాగుపడతాయన్నారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ఫ్యాక్టరీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు ఏఆర్‌జీ శర్మ, నియోజకవర్గ కన్వీనర్ కె.రమణమూర్తి, కార్మిక సంఘ నాయకులు కేవీవీఎస్ భాస్కరరావు, గల్లా రాజేశ్వరరావు, తదితరులు ఎంపీని కలిసి వినతిపత్రం అందించారు.



అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ, కార్మిక సంఘాల నాయకులు

ఆక్వా సాగుతో అధిక ఆదాయం

సముద్ర ఎగుమతుల అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సిబాషిస్ మహంతి



మత్స్యకారులకు కిట్లు అందజేస్తున్న అధికారులు

చీడికాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సమకూరుతుందని సముద్ర ఎగుమతుల అభివృద్ధి (ఎస్ఆర్‌డీ) విశాఖ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సిబాషిస్ మహంతి అన్నారు. సమగ్ర ఎగుమతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆక్వా కల్చర్ చెరువులో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత శుభ్రతపై కోనాం ఎస్సీ మత్స్యకారులకు సోమవారం రైతు సేవా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగు ద్వారా ఎక్కువ రొయ్యిలను పెంచితే ఇతర దేశాలకు ఎగుమతులు చేసుకోవచ్చునన్నారు. నాక్సా సంస్థ ఫీల్డ్ మేనేజర్ పి.రాము మాట్లాడుతూ ఆక్వా ద్వారా రూ.6 లక్షలు పెట్టుబడులు పెడితే సుమారు రూ.12 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. అయితే చేపల చెరువుల్లో కోళ్లకు సంబంధించిన వ్యర్థాలు వేయడం వల్ల శ్వాసకోస వ్యాధులు సంభవిస్తాయని ఆయన చెప్పారు. అనంతరం 30 మంది మత్స్యకారులకు ఉచితంగా కిట్లు అందించారు. ఈ శిక్షణలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారులు టి.నాగమణి, ఆర్.రూపదేవి, గంగాధర్, సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, సంఘం అధ్యక్షుడు కిమిడి దేముడు, సభ్యులు ఎన్.తాతాలు, మట్టా బాబూరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఫర్నిచర్‌కు రూ.8 లక్షలు మంజూరు

గొలుగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫర్నిచర్ కొనుగోలుకు రూ.8 లక్షలు మంజూరయ్యాయని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి తెలిపారు. మండలంలోని చీడిగుమ్మల పీహెచ్‌సీని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.75 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. అయితే చీడిగుమ్మల పీహెచ్‌సీలో ఫర్నిచర్ కొరత ఉన్నట్టు స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ మేరకు రూ.8 లక్షలు మంజూరు చేసినట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కామిరెడ్డి గోవింద్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల నిరసన

మాడుగుల రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం కేజేపురంలో చెరకు కాటా ఆవరణలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, ఇదే సమయంలో ఉపాధి కోల్పోయిన తమను సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వాహనమిత్ర పథకం కింద రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాలని, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల సంఘం సభ్యులు వెంకట సూరప్పారావు, రాము, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రోడ్డు నిర్మించరూ..

దేవరాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కలిగొట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రహదారి సదుపాయం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ఈ మేరకు మండల పరిషత్ ఏవోలక్ష్మీనారాయణకు సోమవారం వినతిపత్రం అందించారు. పాఠశాలకు వెళ్లే మార్గం సక్రమంగా లేదని, శ్మశాన వాటికను ఆనుకొని రహదారి ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో స్పందించాలని విన్నవించారు.

మాడుగులలో భారీ వర్షం

మాడుగుల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగానే ఉంది. 11 గంటల సమయంలో వాతావరణంలో మబ్బులు కమ్మాయి. అనంతరం గంటకు పైగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి నీరు చేరింది. ఈ వర్షంతో వాతావరణం చల్లబడింది.

నేత్ర దానంపై అవగాహన ర్యాలీ

దేవరాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై వైద్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి వనజ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. నేత్రదానం చేసి మరొకరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఈ సందర్భంగా డాక్టర్ వనజ కోరారు. ఆప్తాలమిక్ అధికారిణి భవాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీ

దేవరాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం పోలీస్ చెక్‌పోస్టు సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి రవాణా జరగకుండా నిఘా పెట్టామని ఈ సందర్భంగా ఎస్ఐ వి.సత్యనారాయణ చెప్పారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని చెక్‌పోస్టు సిబ్బందిని ఆదేశించారు. లైసెన్సులు, రికార్డులు పరిశీలించాలని ఎస్ఐ సూచించారు.

నేడు ములకలాపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా ఏర్పడుతున్న ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి, తమకు సహకరించాలని కోరారు.

మల్లవరం ఛానల్ గండిని వెంటనే పూడ్చండి

» అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం


గండిని పరిశీలిస్తున్న అయ్యన్నపాత్రుడు

కోటవురట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని జల్లూరు వంతెన వద్ద గండి పడిన మల్లవరం ఛానల్‌ను సోమవారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. గండిని వెంటనే పూడ్చాలని, శాశ్వత మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాండవ రిజర్వాయర్ గేట్లు, పంట కాలువల అభివృద్ధి ఏడాది కాలంలో రూ.6.3 కోట్లు ఖర్చుచేసినట్టు చెప్పారు. మరో 25 పనులు చేపట్టడానికి రూ.2.66 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, ఆర్డీవో వీవీ రమణ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు, కూటమి నాయకులు వున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా పింఛన్ల పంపిణీ

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రతిష్ఠాత్మంగా అమలు జరుగుతోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం గిడుతూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 63,19,309 మందికి పింఛన్లు ఇస్తున్నదని, దీనికి రూ.2,729.27 కోట్లు ఖర్చు చేస్తున్నదన్నారు. మాకవరపాలెంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.12.41 కోట్లతో 121 పనులు చేపడుతున్నామని తెలిపారు. గిడుతూరు గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.60 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. పింఛన్లు తీసేస్తున్నారని చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను ఉద్దేశించి చెప్పారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 4న నిర్వహించే రక్తదాన శిబిరానికి దాతలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, ఎస్‌వీఎస్ చినబాబు, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, ఎస్‌వీకే చంద్ర, రుత్తల సర్వదేవుళ్లు, ఎంపీటీసీ కసిరెడ్డి నాకరాజు పాల్గొన్నారు.

విజనరీ నేత చంద్రబాబు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు


బత్తుల తాతయ్యబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

అనకాపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజనరీ ఉన్న నేత అని, తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేసిన ఘనత ఆయనకే దక్కుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్కరణల అమలు, సంపద సృష్టి, అభివృద్ధి ప్రణాళికలు, దార్శనికతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల క్రితమే 'ప్రజల వద్దకే పాలన' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ఎంతో దూరదృష్టి వున్న నేత చంద్రబాబు అని కొనియాడారు. ఆయన నాయకత్వంలో కూటమి పాలనతో రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

మళ్లీ వర్షాలు

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు.

రైవాడ నుంచి 500 క్యూసెక్కులు విడుదల


రైవాడ రిజర్వాయర్ స్పిల్‌వే గేటు నుంచి నదిలోకి విడుదల అవుతున్న నీరు

దేవరాపల్లి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రైవాడ జాశయం నీటి మట్టం 113.55 మీటర్లుకు చేరడంతో అధికారలు సోమవారం సాయంత్రం స్పిల్‌వేలో ఒక గేటును ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా సమ్మెద, పినకోట, చల్లగెడ్డల నుంచి జలాశయంలోకి సుమారు 900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో నీటిమట్టం 113.55 మీటర్లకు చేరడంతో ఇన్‌ఫ్లోనుబట్టి అదనపు నీటిని నదిలోకి విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.

వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలి

» బదిలీల సమయంలో చాలామంది ఫోన్ చేస్తున్నారు
» వ్యక్తిగత కారణాలు చెప్పి ట్రాన్స్‌ఫర్ నిలపాలని కోరుతున్నారు
» ఆ తరహా సిఫారసులు నేను చేయను
» క్యాన్సర్‌ను నియంత్రించేందుకు నడుంబిగించిన ప్రభుత్వం
» చికిత్స కంటే ముందుగా గుర్తించడమే కీలకమన్న విధానంతో ముందుకు వెళుతున్నాం
» క్యాన్సర్ వల్ల ముగ్గురు కుటుంబ సభ్యులను కోల్పోయా
» అందుకే ఆ మహమ్మారిపై పోరాటం
» వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్
» కేజీహెచ్‌లో అత్యాధునిక చికిత్సా పరికరాలు ప్రారంభం



వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేజీహెచ్ వైద్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య విద్యార్థులు గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో అనుసంధానమై పనిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కేజీహెచ్‌లోని కాంప్రెహెన్సివ్ క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన అత్యాధునిక పరికరాలను సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర మెడికల్ కళాశాల ఆవరణలోని సెంటినరీ అకడమిక్ బ్లాక్‌లో వైద్యులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బదిలీల సమయంలో ఎంతోమంది వైద్యులు తనకు ఫోన్లు చేస్తున్నారని, వ్యక్తిగత కారణాలు చెప్పి బదిలీలు నిలపాలని కోరుతున్నారన్నారు. ఆ తరహా సిఫార్సులు తాను చేయబోనన్నారు. వైద్యులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించేందుకు నడుంబిగించిందని మంత్రి సత్యకుమార్ అన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు రాకుండా జాగ్రత్తపడడంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామని, కొందరు మహిళలు ముందుకురాకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సర్వే కోసం వేలాది మంది వైద్య సిబ్బందిని వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. చికిత్స కంటే ముందుగా గుర్తించడమే కీలకమన్న విధానంతో ముందుకు వెళుతున్నామన్నారు.

క్యాన్సర్ వల్ల తాను కుటుంబంలో ముగ్గురిని కోల్పోయానని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మ, సోదరుడు, అక్క క్యాన్సర్‌తో మరణించినట్టు తెలిపారు. ఆ ఘటనలు తనను ఎంతగానో కలచివేశాయని, అందుకే క్యాన్సర్ మహమ్మారిపై ప్రజాప్రతినిధిగా పోరాటం చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ రంగంలో నిష్ణాతులను తయారుచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు వెళుతున్నామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక పరికాలు అందించడం గొప్ప విషయమన్నారు. మరోఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, రెండుసార్లు గుండెపోటు వస్తే ప్రాణాలు నిలిపిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య, అంకాలజీ విభాగం వైద్యాధికారులు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ శిల్ప, డాక్టర్ పాండురంగకుమారి, డాక్టర్ చంద్రశేఖరం నాయుడు, డాక్టర్ గిరినాథ్‌తోపాటు అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలకు చర్యలు

» మంత్రి సత్యకుమార్


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

మాడుగుల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం మాడుగులలో ప్రభుత్వాస్పత్రిని ఆయన ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్, జిల్లా, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

» అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యల పై నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ జాహ్నవి, డీఆర్ఓ సత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై వెంటనే సంబంధిత అధికారులను వివరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించినట్టు స్వయంగా చెప్పాలని ఆదేశించారు. ఒకే సమస్యకు సంబంధించి అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 260 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు అందే ప్రతి అర్జీని పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి గోడును ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలపై ఏడు రోజుల్లో విచారణ పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కాగా పీజీఆర్ఎస్‌లో 32 అర్జీలు అందినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు తెలిపారు.

5న న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

» ముఖ్యఅతిథిగా హాజరు కానున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
» వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు. పక్కన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్

సబ్బవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవం (8 నుంచి 12 వరకు) ఈ నెల ఐదో తేదీ ఉదయం విశాఖపట్నంలోని హోటల్ నోవాటెల్‌లో జరుగుతుందని ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారన్నారు. గౌరవ అతిథులుగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.నరసింహ, జస్టిస్ జేకే మహేశ్వరి (డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్), ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ చాన్సలర్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్-2, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర కొత్త భవనాలను ప్రారంభిస్తారని, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తారనిఇ చెప్పారు. మీడియా సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు పాల్గొన్నారు.

కాజ్‌వేను పునరుద్ధరించరా?

... 5వ పేజీ తరువాయి

సైతం పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే పునరుద్ధరణ పనులపై సంబంధిత అధికారులను వివరణ కోరగా.. రూ.30 లక్షల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆమోదం లభించిన వెంటనే పనులు చేయిస్తామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి, ప్రభుత్వం నుంచి సత్వరమే నిధుల మంజూరుకు కృషి చేయాలని, వీలైనంత త్వరగా కాజ్‌వేను అందుబాటులోకి తీసుకురావాలని పలు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల హెచ్ఎం స్వర్ణకుమారి.. బాలికల ఉన్నత పాఠశాలను ప్లస్ 2కి అప్‌గ్రేడ్ చేయాలని, డైనింగ్ హాలు, వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎంపీ రమేశ్ స్పందిస్తూ.. తక్షణమే ఆయా పనులకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

కశింకోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం వద్ద లారీని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలం రావణాపల్లి గ్రామానికి చెందిన సిహెచ్.రామకృష్ణ (36) దివ్యాంగుడు. ఇతను గాజువాకలో ఒక అపార్టుమెంటులో ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ద్విచక్ర వాహనంపై సొంతూరు వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకున్నాడు. తిరిగి గాజువాక వెళుతుండగా బయ్యవరం జంక్షన్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ క్రమంలో రామకృష్ణ లారీ వెనుక చక్రం కింద పడిపోవడంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. రామకృష్ణ తల్లి కన్నతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వరహా నదిలో మునిగి రైతు మృతి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం సమీపంలో వరహా నదిలో మునిగిపోయి వ్యవసాయ కూలీ మృతిచెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. లింగరాజుపాలెం గ్రామానికి చెందిన కోడిబోయిన సత్తిబాబు (46) వరహా నది అవతల వమ్మవరంలో ఉన్న తన పొలంలో పనుల నిమిత్తం ఆదివారం ఉదయం నదిని దాటుకుని వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం ఉదయం బసవపాడు వద్ద వరహా నదిలో సత్తిబాబు మృతదేహం కనిపించింది. ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో వరహా నది దాటుతూ వరద ఉధృతికి నీట మునిగి మృతిచెంది వుంటాడని కుటుంబ సభ్యులు భావించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వెనుక నుంచి లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

పాయకరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వై జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి లారీని, వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ పురుషోత్తం అందించిన వివరాలు... పాయకరావుపేట వీవర్స్ కాలనీకి చెందిన బండారు దుర్గాగోవింద (39) తాపీపనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా వై జంక్షన్ సమీపంలో ముందు వెళుతున్న లారీ ఆకస్మికంగా ఆగింది. దీంతో గోవిందు లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గోవిందుకు భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనవానిపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన కాసా దుర్గాప్రసాద్ (28), వలపుశెట్టి శ్రీలక్ష్మి ద్విచక్రవాహనంపై ఆదివారం విశాఖపట్నం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని అర్ధరాత్రి తిరిగి జగ్గంపేటకు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామును రెండున్నర గంటల ప్రాంతంలో కోనవానిపాలెం వద్ద ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో దుర్గాప్రసాద్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కుర్చున్న శ్రీలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. దుర్గాప్రసాద్ జగ్గంపేటలో హోల్‌సేల్ కిరాణా వ్యాపారి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అప్పన్న ఆలయ ఉద్యోగుల చేతివాటం

» హుండీ ఆదాయం లెక్కిస్తున్న క్రమంలో చోరీ
» సీసీ టీవీ కెమెరాలో గుర్తించిన ఈఓ
» అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు, పర్మనెంట్ ఉద్యోగి సస్పెన్షన్

సింహాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సమయంలో ఉద్యోగులు చేతివాటం చూపించారు. ఇద్దరు ఉద్యోగులు రూ.500 నోట్లను తెల్లకాగితంలో చుట్టి బ్యాగులో దాచడం సీసీ టీవీ కెమెరాలో రికార్డు కావడంతో ఈవో వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపిన వివరాల ప్రకారం...సింహగిరిపై పరకామణి కేంద్రంలో సోమవారం ఈవో ఆధ్వర్యంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. దేవస్థానం ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆదాయం లెక్కింపు ప్రారంభించారు. మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టు విభాగంలో క్లీనర్‌గా పని చేస్తున్న కె.రమణ కొన్ని రూ.500 నోట్లను తెల్లకాగితాల్లో చుట్టి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పంచదార్ల సురేష్‌కు అందజేశాడు. అతడు దానిని తన వద్ద ఉన్న హుండీ తాళాలు భద్రపరిచే బ్యాగ్‌లో దాచేశాడు. ఈ మొత్తం వ్యవహారం సీసీ టీవీ కెమెరాలో రికార్డయింది. ఈవో సీసీ టీవీ ఫుటేజిని పరిశీలిస్తుండగా చోరీ వ్యవహారం బయటపడింది. దీంతో ఆ ఇద్దరు ఉద్యోగులను తనిఖీ చేయాలని ఏఈఓ రమణమూర్తిని ఆదేశించారు. తనిఖీల్లో సురేష్ వద్ద ఉన్న బ్యాగ్‌లో 111 రూ.500 నోట్లు బయటపడ్డాయి. విచారించగా రమణ తనకు ఇచ్చినట్టు అంగీకరించాడు. ఈ ఘటనలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్‌ను విధుల నుంచి తప్పించడంతో పాటు పర్మినెంట్ ఉద్యోగి కె.రమణను ఈవో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. అనంతరం వారిపై గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తేజేశ్వరరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దేవుడి మాన్యాలకు కొరవడిన రక్షణ

... 5వ పేజీ తరువాయి

వ్యాపారి ఈ భూముల్లో లేఅవుట్ వేసి, ప్లాట్లు అమ్ముకోగా, సీపీఎం నాయకులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో న్యాయస్థానం స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో దేవదాయ శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆలయ భూములను స్థానిక నేత ఒకరు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థకు అమ్మేయడంపై ఫిర్యాదులు అందడంతో విచారణ జరుగుతున్నది.

అనకాపల్లి జిల్లాలో దేవదాయ శాఖకు వేల ఎకరాల భూములు వున్నాయి. కోట్లా రూపాయల విలువ చేసే ఈ భూముల పరిరక్షణను ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూములకు సంబంధించి సరైన రికార్డులు లేకపోవడం కబ్జాదారులకు వరంగా మారుతున్నది. ఆలయాల భూముల పరిరక్షణకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. నిబంధనల ప్రకారం ఆలయ భూములను కౌలుకు తీసుకున్న వ్యక్తులు, గడువు తీరిన తరువాత భూములను ఖాళీ చేసి అధికారులకు అప్పగించాలి. లేనిపక్షంలో సెక్షన్ 83 ప్రకారం ఆయా రైతులకు నోటీసులు జారీచేసి భూములను స్వాధీనం చేసుకోవాలి. కానీ అన్యాక్రాంతమైన ఆలయాల భూముల వద్ద అధికారులు మొక్కుబడిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

ఫిర్యాదులపై స్పందిస్తున్నాం

కేఎల్ సుధారాణి, దేవదాయ శాఖ జిల్లా అధికారిణి

ఆలయాల భూముల అన్యాక్రాంతం అయినట్టు ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తున్నాం. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ భూముల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాం. మాడుగులలో ఆలయ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేశారన్న ఫిర్యాదులతపై విచారణ జరుగుతున్నది. దేవదాయ శాఖ భూములకు రెవెన్యూ హక్కులు ఇవ్వడానికి అవకాశం లేదు. ఆలయాల భూముల విషయంలో ప్రస్తుతం కోర్టుల్లో 11 కేసులు నడుస్తున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574